



గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

విష జ్వరాల పంజా





● సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

డెంగీ జ్వరం దడపుట్టిస్తోంది.. టైఫాయిడ్ విజృంభిస్తోంది.. మలేరియా నేనెక్కడకీ పోలేదంటున్నది. మొత్తం మీద వైరల్ జ్వరాలతో పల్లె పట్టణం అన్న తేడా లేకుండా వణికిపోతోంది. వాతావరణంలో చోటు చేసుకుంటోన్న మార్పులు.. అపరిశుభ్రత.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తదితరాల కారణంగా విష జ్వరాలు ప్రభలుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఇటీవల పలు ప్రాంతాల్లో మరణాలు కూడా సంభవించాయంటే జ్వరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. పల్లెలు మంచం పట్టగా ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు జ్వర పీడితులు బారులు తీరుతున్నారు. ఇక ప్రైవేటు వైద్యశాలల్లో అయితే ఐసీయూలు కూడా డెంగీ లక్షణాలతో ఉన్న వారితో నిండిపోయినట్లు సమాచారం. అధికారికంగా డెంగీ కేసులను వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించకపోయినా పలు పల్లెలు, పట్టణాల్లో పలువురు అల్లాడుతున్నట్లు తెలుస్తోంది. జ్వరాల తో ప్రజలు వణికిపోతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలతో నిర్లక్ష్యాన్ని వీడటంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

- డెంగీ దడ.. టైఫాయిడ్ విజృంభణ
- వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- మంచం పట్టిన పల్లెలు.. ఆస్పత్రులు కిటకిట
- మరణిస్తున్నా.. తూతూమంత్రంగా శిబిరాలతో సరి
- పడకేసిన పారిశుధ్యం.. పట్టీపట్టనట్లుగా అధికారులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: జ్వరం.. ఈ పదం ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ప్రధానంగా టైఫాయిడ్, మలేరియా, ఫ్లూ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎక్కడ ఎవరికి ఏ కారణంతో జ్వరం వచ్చినా అది డెంగీ భూతమేమోనని జనం హడలిపోతున్నారు. జలుబు, దగ్గుతో ప్రారంభమయ్యే జ్వరాలు గతంలో 3, 5 రోజుల్లో తగ్గేవి. అయితే ప్రస్తుతం వస్తున్న జ్వరాలు తీవ్ర స్థాయిలో ఉండటం.. ఒకటి రెండు రోజుల్లోనే నీరసంతో యువకులు సైతం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో వారు మరింతగా జ్వరపీడితులను, వారి కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. డెంగీ జ్వరమని చెప్పడం.. ప్లేట్‌లెట్ కౌండ్ తగ్గిపోతుందంటూ దోపిడీ చేసేస్తున్నారు. కాలానుగుణంగా వచ్చే మలేరియా.. డెంగీ.. టైఫాయిడ్ కేసులు గుబులు రేపుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. చిన్న పిల్లల్లో టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జ్వరాల కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. జ్వరం అనుకుని తొలుత ఇంటి దగ్గర్లోని షాపుల్లో మందులు తెచ్చుకుని వినియోగిస్తున్నారు. జ్వరం ఎంతకీ తగ్గకపోతుండటంతో రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు. జ్వర పీడితుల్లో చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. జ్వర పీడితుల్లో ప్లేట్ లెట్స్ స్థాయి పడిపోయి ప్రాణాంతకంగా పరిణమిస్తోంది.

- నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల జరిపిన రక్త పరీక్షల్లో 7 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా డెంగీ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు తెలిపారు. నరసరావుపేటలోని ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలు రెండింటిలో జ్వరాల కేసుల నమోదును పరిశీలించగా పది మందికి రక్త పరీక్షలు చేయగా రెండు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. వినుకొండ మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో వైరల్ జ్వరాలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. ఊపిరాడని దగ్గు, తుమ్ములు, జ్వరంతో పిల్లలు పలువురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన లక్ష్మీతిరుపతమ్మ, గాలం సింహాద్రి, గాలం రాణీలు వైరల్ జ్వరాలతో అల్లాడుతున్నారు. ముంచుకొస్తున్న జ్వరాలతో, వైద్యసిబ్బంది వచ్చేదాక ఆగలేక పలువురు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నందునే తాము ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు. రొంపిచర్ల మండలం రొంపిచర్ల రెడ్డిపాలెం పరిధిలోని గ్రామాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీల వద్ద వైద్య చికిత్సలు చేయించుకుంటున్నా పరిస్థితి అదుపులోకి రావడంలేదు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో పల్లె, పట్టణం, చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా జ్వరాలు చుట్టేస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు సగటున జ్వరాలతో వచ్చే వారి సంఖ్య 40 వరకు ఉందని వైద్యులు తెలిపారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు సాధారణ జ్వరాలతో వచ్చే వారు రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఉంటున్నట్లు సమాచారం. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జ్వర పీడితులు పెద్దవారు 450 మంది, చిన్న పిల్లలు 70 మంది చికిత్స పొందారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంకా స్పత్రిలో వివిధ గ్రామాలకు చెందిన జ్వర పీడితులు 20 మంది వరకు ఉన్నారు. ఇద్దరు ముగ్గురు డెంగీతో చికిత్స పొంది వెళ్లారు. ఈ 20 మందిలో టైపాయిడ్ బాధితులు కూడా ఉన్నారు. అచ్చంపేట మండలం కొండూరు, నిండుజర్ల, తాడువాయి గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఎక్కువ మందికి టైపాయిడ్ జ్వరాలని సమాచారం. దాచేపల్లి మండలంలోని శ్రీనగర్, పొందుగల, శ్రీనివాసపురం, దాచేపల్లిలోని జలగడబజార్, మస్కిట్‌బజార్, వడియరాజుల కాలనీ, నడికూడిలోని ఎస్సీ కాలనీ, నారాయణపురంలో జ్వరంతో బాధపడే వారి సంఖ్య అధికంగా ఉంది. రక్తకణాలు పడిపోవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాలపై దృష్టి సారించలేదు. ఇప్పటికే దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలలన్నీ రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. ప్రైవేటు వైద్యశాలలో బెడ్లు లేక కుర్చీలలోనే కూర్చొని సెలైన్‌లు పెట్టించుకోవడం చూస్తుంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తుంది.



దాచేపల్లి: ప్రైవేటు వైద్యశాలలో బెడ్లు లేక కుర్చీలో సెలైన్ ఎక్కిం చుకుంటున్న రోగులు

● బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో విష జ్వరాలతో పలువురు మంచంపట్టారు. గ్రామంలో ఒకరు డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు తెలిసిన అధికారులు హడావుడిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తిస్తున్నారు. మూడురోజులపాటు జ్వరం తగ్గని అనేకమందిని ఆస్పత్రులకు తరలించారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ఇప్పటికీ జ్వర పీడితులు అనేక మంది ఉన్నారు. వైద్య శిబిరం కొనసాగిస్తున్నప్పటికి జ్వరాలు అదుపులోకి రాలేదు. బాపట్ల పట్టణంలోని 2వ వార్డు రామకృష్ణాపురంలో ఓ వ్యక్తికి తీవ్రమైన జ్వరంతో గుంటూరులో వారం నుంచి చికిత్స పొందుతున్నారు. చీరాల ఏరియా వైద్యశాలకు ప్రతిరోజూ సరాసరిన 350 ఓపీలు వస్తుండగా అందులో సుమారు 50 నుంచి 60 మంది వరకు జ్వరపీడితులు ఉంటున్నారు. అందులో రమారమి 10 శాతం మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే వారిలో సగం మంది జ్వరపీడితులు ఉంటున్నారు.

● చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం విష జ్వరాలతో మంచం పట్టింది. విష జ్వరాలతో ఇటీవల ఆరుగురు ఆస్పత్రిలో చేరారు. విష జ్వరాలతో బాధపడుతున్న తాతారావు(65), కృష్ణ కుమారి(52) నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విష జ్వరాలతో ఇద్దరు మృతితో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్పటికప్పుడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలోనే 30 మంది జ్వర పీడితులు, జ్వర లక్షణాలతో ఉన్నవారిని గుర్తించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



వినుకొండ : ఉప్పరపాలెంలో దగ్గు, జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు

మంచినీరే.. స్థావరం

అందరినీ భయపెడుతున్న డెంగీ కారక వైరస్‌ను మోసుకొచ్చే దోమ ఈడీస్ ఈజిప్ట్. ఈ దోమ పగటి పూట మాత్రమే సంచరిస్తుంది. అది కూడా రోజుకు రెండు సార్లు ఆకలి అయినప్పుడు మాత్రమే ఉదయం, సాయంత్రం రక్తం తాగుతుంది. ఇది నివాసం ఏర్పర్చుకున్న పరిసరాన్నుంచి కేవలం 30 అడుగుల దూరం మాత్రమే ప్రయాణిస్తుంది. అది కూడాభూమి కన్నా రెండు అడుగులు మించి లెగవదు. అది కూడా ఆడదోమ మాత్రమే. ఇది మురుగులో ఉండదు. ఇది మంచినీటిపైనే గుడ్లు పెడుతుంది. ఇంట్లో వాడకుండా వదిలేసిన పాత సామాన్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పూల కుండీలు వాటర్ ట్యాంక్‌పై ఉండే చిన్న చిన్న రంధ్రాలు వాటిలో చేరిన వర్షపు నీరును ఇది స్థావరంగా ఏర్పర్చుకుంటుంది. 15 రోజుల పాటు మన ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే మన కుటుంబం డెంగీ బారిన పడనట్లే. కేవలం మన పరిసరాల పరిశుభ్రతే మనల్ని డెంగీ నుంచి కాపాడుతుంది.

డెంగీ.. కంగారు

డెంగీతో ప్లేట్‌లెట్లు తగ్గిపోయాయంటూ రోగులు, వైద్యులు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రతి జ్వరానికి ప్లేట్‌లేట్ల పరీక్ష పేరిట రోగులను భయపెట్టి అందిన కాడికి దండుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా విస్తరిస్తోన్న వైరల్ జ్వరాల్లో 90 శాతం సాధారణ ఫ్లూ జ్వరాలే. అయితే వైద్యులు వ్యాపార రీత్యా డెంగీతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య పరీక్షలను సూచిస్తున్నారు. ప్రైవేటు ల్యాబుల్లో చేస్తున్న పరీక్షల్లో నూటికి 90 మందికి డెంగీ ఉన్నట్లుగానే చూపుతుంది. దీనికితోడు అక్కడక్కడ సంభవిస్తున్న మరణాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దోమల ఫాగింగ్ శూన్యం



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు నగరం నుంచి పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటిపోయింది. గతంలో కురిసిన వర్షాలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాత్రిళ్లు కాదు పగలు కూడా దోమల విజృంభణతో ప్రజలు అల్లాడుతున్నారు. దోమలు, అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో దోమల నివారణ చర్యలను గాలికొదిలేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడమే మున్సిపాల్టీలు మరిచిపోయాయి. వారానికోసారి కూడా ఫాగింగ్ జరగడంలేదు. మురుగు కాల్వల్లో దోమల నివారణ మందుల పిచికారి చేయడాన్నే మానేశాయి. పల్లెలు, పట్టణాల్లోని కాలనీలు జ్వరాలతో మంచం పట్టినట్లు మీడియాలో కథనాలు వచ్చిన సందర్భాల్లో వైద్య ఆరోగ్యశాఖ హడావుడిగా వైద్యశిబిరాలను నిర్వహిస్తోంది.

ప్రాణదాతలకు రక్షణేది?



- కోల్‌కతా ఆర్జీకర్ వైద్యశాల ఘటనపై నిరసన
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో విధుల బహిష్కరణలు
- ఎక్కడికక్కడ ప్రదర్శనలు, ధర్నాలు, అధికారులకు వినతుల సమర్పణలు

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసనలు మిన్నంటాయి. రోగుల ప్రాణాలు నిలబెట్టే వైద్యులకే రక్షణ లేకుండా పోతుందంటూ నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ ప్రైవేటు వైద్యశాలలు బంద్ చేసిన వైద్యులు ప్రదర్శనలు చేపట్టారు. గుంటూరులో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు లాడ్జి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు చేసే వారిని నాన్ బెయిలబుల్ సెక్షన్‌తో పాటు భారీ జరిమానా విధించేలా చట్టం తేవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ కోరారు. టీడీపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గుంటూరులో మహిళలు నోటికి నల్లరిబ్బన్లు ధరించి, వెలుగుతున్న కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతుగా శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ) గుంటూరు యూనిట్ సభ్యులు ధర్నా చేశారు. కలకత్తాలో పీజీ విద్యార్థిని ఘటనపై రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో కొవ్వొత్తులతో నిరసన జరిగింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు కోల్‌కత్తా ఘటనకు సంతాపంగా శనివారం యూనివర్సిటీలోని అబ్దుల్ కలాం విగ్రహం నుంచి ముఖ ద్వారం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జ్‌లతో నిరసన తెలిపారు. చేబ్రోలు పరిధిలోని వడ్లమూడి డీవీసీ హాస్పల్ వైద్యులు, సిబ్బంది ఓపీ సేవలు నిలిపివేసి నిరసన ప్రదర్శన చేశారు.


చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల విద్యార్థులు గౌతమబుద్ధరోడు మీదగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్లో అధికారులకు, అడ్మిన్ ఏఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది రెండు గంటల పాటు విధులు బహిష్కరించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. శావల్యాపురం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పీహెచ్‌సీ నుండి శావల్యాపురం సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో, కర్లపాలెం, కొల్లూరు, నాదెండ్ల, రెంటచింతల, తాళ్ళూరు, కారంపూడి, ఫిరంగిపురం మండలం నుదురుపాడు పీహెచ్‌సీ, మాచవరం, దాచేపల్లి జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా వైద్యులు, సిబ్బంది నిరసనలు తెలిపారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాల, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తహసీల్దార్ జియాఉల్‌హక్‌కు వినతిపత్రం అందించారు. చిలకలూరిపేటలో వైద్యులు వైద్య సేవలు నిలిపి వేసి నరసరావుపేట సెంటర్‌లో మానవహారంగా బహిరంగ నిరసన తెలిపారు. రేపల్లెలో ఐఎమ్ఏ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డీవో హేలా షోరాన్‌కు వినతిపత్రం అందించారు. బాపట్ల కొత్తబస్టాండ్ దగ్గర నుంచి గడియారస్తంభం మీదగా అంబేద్కర్ సర్కిల్ వరకు వైద్యుల నిరసన ప్రదర్శన జరిగింది.



నరసరావుపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య బృందం

భూముల క్రమబద్ధీకరణ జరిగేనా?


- గత ఏడాది 800 మందికి పైగా దరఖాస్తు
- ప్రభుత్వం మారడంతో ఉత్తర్వులు పెండింగ్
- కూటమి సర్కారు దృష్టి పెట్టాలంటున్న యజమానులు



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ భూపరిమితుల చట్టం(యూఎల్‌సీ) కింద సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ ఎండమావిగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం రెగ్యులరైజేషన్ జీవోలు ఇవ్వడం, వాటికి ఆశపడి భూ యజమానులు దరఖాస్తు చేసుకోవడం, ఆ తర్వాత ఏదో ఒక సాకు చూపించి క్రమబద్ధీకరణ చేయకపోవడం పరిపాటిగా మారింది. చివరిసారిగా కొన్ని నిబంధనలను సడలించి గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తుకు అనుమతి ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో నేటి వరకు రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం రెవెన్యూ శాఖ నుంచి వెలువడలేదు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా తమ దరఖాస్తుల విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని భూయజమానులు కోరుతున్నారు. జిల్లాలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఐదు రెవెన్యూ గ్రామాల కింద సీలింగ్ భూములను గుర్తించారు. గుంటూరు, కొరిటెపాడు, నల్లపాడు, ఆర్ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం రెవెన్యూ గ్రామాల్లో 98 హెక్టార్ల సీలింగ్ భూములున్నాయి. నగర జనాభా పెరిగిపోవడంతో సీలింగ్ భూములన్నింటిలో పెద్ద పెద్ద భవనాల నిర్మాణం జరిగాయి. వీటిపై రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా సంపూర్ణ హక్కుల కల్పన జరగడం లేదు. 2019 మే ఒకటో తేదీ నాటికి ఆయా స్థలాల్లో నివాసం ఉన్న వారికి రిజిష్టర్డ్ డాక్యుమెంట్ ఉంటే వారంతా క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని గత ఏడాది ప్రభుత్వం కల్పించింది. 150 చదరపు గజాల వరకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న వారికి ఉచితంగానే డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రకటించారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. అదే 300 నుంచి 500 చదరపు గజాల వరకు అయితే మూల విలువలో 30 శాతం, 500 చదరపు గజాల పైన అయితే 100 శాతం బేసిక్ విలువని చెల్లించాలని నిబంధనలు పెట్టింది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా దరఖాస్తుల పరిశీలనకు ఒక కమిటీని కూడా ప్రభుత్వం అప్పట్లో నియమించింది. జాయింట్ కలెక్టర్‌ని మెంబర్ సెక్రెటరీగా, సభ్యులుగా గుంటూరు ఆర్‌డీవో, జిల్లా సర్వే అధికారి, రిజిస్ట్రార్‌లను నియమించింది. ఆ మేరకు జిల్లాలో 800లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి. వాటిని ప్రభుత్వానికి నివేదించామని, అయితే అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆర్డర్స్ రాలేదని చెబుతున్నాయి. కాగా 150 చదరపు గజాలకు పైగా విస్తీర్ణం కలిగిన కేటగిరీలకు చెందిన వారు నగదు చెల్లించి దాదాపుగా ఎనిమిది నెలలు పూర్తి కావొస్తున్నది. దీంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

దిక్సూచి DIKSUCHI

నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్ట్‌లు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్ట్‌లు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్ అనుబంధ కళాశాలల్లో

మేనేజ్‌మెంట్ కోటా

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసు కోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూలో బీఆర్క్



కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/sS6GAamలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియోలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్.. ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రధానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రధానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.


ప్రేక్షకులు దూరమైంది అందుకే

- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి 'నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఇన్ ప్రోగ్రెస్



'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు


నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్క్రిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు: తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

21న జిల్లా అథ్లెటిక్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 17: అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16 18, 20, బాలబాలికల విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరులో ఏఎన్‌యూలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు అదే రోజున ఉదయం 9 గంటలకు సింథటిక్ ట్రాక్‌లో తమ వయసు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రిపోర్ట్ చేయాలని కోరారు. ఇతర వివరాలకు 96666 35296 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం
22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 17: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పిశైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు 22లోగా దరఖాస్తులు ఎంఈవోలకు అందజేయాలని, ఎంఈవోలు వాటిని పరిశీలించి 24న డీవైఈవోకు అందజేస్తారని తెలిపారు. డీవైఈవోలు 27 లోగా జిల్లా విద్యాశాఖకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు కనీసం 15 సంవత్సరాల సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణా చర్యలకు లోనై ఉండరాదని స్పష్టం చేశారు.

మైనార్టీ సంక్షేమశాఖ వసతిగృహంలో
ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), ఆగస్టు 17: మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీ, పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమెట్రిక్ మైనార్టీ వసతి గృహం రవీంద్రనగర్ 1వలైనులో, పోస్టుమెట్రిక్ బాలకల వసతి గృహం పొన్నూరు రోడ్డులోని ఆనందపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా హాస్టల్స్‌లో వసతి పొందాలనుకునేవారు సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సంప్రదించాలని (93921 05096, 88044 22522)సూచించారు.

ఉపాధి కార్మికులకు వేతన బకాయిల విడుదల

● జిల్లాకు రూ.51.95 కోట్లు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధి హామీ పథకం కార్మికులకు వేతనాలు చెల్లించారు. జిల్లాలోని కార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ.51.95కోట్లు జమ చేశారు. పనిచేసినా పస్తులే అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. సుమారు 84 రోజులకు సంబంధించిన వేతనాలను కార్మికులకు అందజేశారు. మే 21 నుంచి ఆగస్టు 12 వరకు వేతన బకాయిలు డీబీటీ పద్ధతిలో వేతనదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు జీ జోసఫ్ కుమార్ శనివారం తెలిపారు.

నూతక్కి పీఏసీఎస్‌కి వరల్డ్ లార్జెస్టు గ్రెయిన్ ప్రాజెక్టు

● పైలట్ ప్రాజెక్టుగా అమలు
● నిధులు సమకూర్చనున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు
● రూ.2కోట్ల వరకు మంజూరయ్యే అవకాశం

గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో తిండిగింజల కొరతని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వరల్డ్ లార్జెస్టు గ్రెయిన్ స్టోరేజ్ ప్రాజెక్టుకి జిల్లాలో మంగళగిరికి సమీపంలోని నూతక్కి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎంపికైంది. పైలట్ ప్రాజెక్టుగా దీనిని వివిధ ఆర్థికసంస్థల సహకారంతో అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సహకార, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అటు రైతులకు, ఇటు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చనున్న ఈ ప్రాజెక్టుని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీంతోపాటే ఇతర పీఏసీఎస్‌లని బలోపేతం చేయడం పైనా దృష్టి సారించింది. ఇందుకోసం జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ పీఏసీఎస్‌ల సందర్శన, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టర్ నాగలక్ష్మి సమీక్షలు చేస్తున్నారు.

పీఏసీఎస్ స్థాయిలోనే వ్యవసాయ మౌలికసదుపాయాల కల్పన ప్రధానలక్ష్యంగా ఈ ప్రాజెక్టుని కేంద్రం అమలుచేస్తున్నది. ఇందులో భాగంగా గోడౌన్ల వికేంద్రీకరణ చేయడం, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రజలకు చౌకధరలకే వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులో ఉంచే దుకాణాలు ఏర్పాటుచేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్), అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్(ఏఎంఐ), సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్‌ఎంఏఎం), ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్(పీఎంఎఫ్‌ఎంఈ) వంటివి వీటికి వర్తింపుచేస్తారు. ఈ స్కీమ్‌ల ద్వారా పీఏసీఎల్‌లు సబ్సిడీలు, వడ్డీ లేని రుణాలు పొంది గోడౌన్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను నిర్మించుకోవచ్చు. అంతేకాకుండా నాబార్డు కూడా తన వంతు మద్దతుని ఇస్తుంది. రీఫైనాన్సింగ్ సౌకర్యాన్ని ఒక శాతానికే ఇస్తుంది. ఏఐఎఫ్ స్కీమ్ ద్వారా రూ.2కోట్లు పొందవచ్చు. పీఏసీఎస్‌ల వ్యాపార కార్యకలాపాలను మార్చేసి స్థిరత్వం తీసుకు రావడమే పైలట్ ప్రాజెక్టు లక్ష్యంగా ఉన్నది.

ఈ పైలట్ ప్రాజెక్టుని ఎన్‌సీడీసీ, ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎన్‌ఏబీసీవోఎస్, ఎన్‌బీసీసీ వంటి సంస్థలు కలిసి అమలుచేసేందుకు అంగీకరించాయి. పైలట్ ప్రాజెక్టుకి ఎంపికైన నూతక్కి పీఏసీఎస్‌కి కన్సల్టెన్సీ సపోర్టు కూడా ఇస్తారు. పీఏసీఎస్ స్థాయిలో నిల్వ సామర్థ్యం వికేంద్రీకరణ వలన పంటలు కోసిన తర్వాత జరుగుతున్న నష్టాలను నియంత్రించొచ్చు. అంతేగాక గ్రామస్థాయిలో ఆహారభద్రత ఉంటుంది. స్టోరేజ్‌లు సమృద్ధిగా అందుబాటులో ఉండటం వలన మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు వీటిల్లో నిల్వ చేసుకోవచ్చు. పీఏసీఎస్‌లు సేకరణ కేంద్రాలుగానే కాకుండా ఫెయిర్ ప్రైస్ షాపులుగా కూడా వ్యవహరిస్తాయి. ఈ కారణంగా రవాణ ఖర్చులు తగ్గుతాయి. గోడౌన్లలో నిల్వచేసిన ఉత్పత్తులపై బ్రిడ్జీ రుణాలు కూడా పొందే అవకాశం కల్పిస్తారు. దానివలన మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి కూడా గ్రామస్థాయిలోనే లభిస్తాయి. వ్యాపారంలో వైవిధ్యం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని కేంద్రం చెబుతున్నది. ఫుడ్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్‌ని సమీకృతం చేయడం వలన మార్కెట్ అవకాశాలను రైతులు పెంచుకోవచ్చు.

నాసిరకం మద్యంతో వేల ప్రాణాలు తీసిన వాళ్లను వదలొద్దు

● తప్పుడు ప్రచారాలతో చేసిన పాపాల నుంచి తప్పించుకోలేరు
● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, ఆగస్టు 17: రాష్ట్రంలో 30వేల మంది ప్రజల ప్రాణాలు తీసిన వైసీపీ దొంగల ముఠాలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తిచేశారు. వైసీపీ చేసిన నిర్వాకాలు చాలక తప్పుడు ప్రచారాలతో తప్పించుకోవాలని చూస్తున్నారని, ఒక్కొక్కర్ని అరెస్టు చేసి విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని శనివారం ఆయన మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం పాత ప్రభుత్వ పాపాలను ప్రక్షాళన చెయ్యాలని చూస్తుంటే ఆ బురదను కూటమి ప్రభుత్వంపై చల్లాలని జగన్ సొంతమీడియా పేటీఎం బ్యాచ్‌లతో అబద్ధపు ప్రచారాలకు పూనుకుందని జీవీ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌రెడ్డి మొట్టమొదట కన్నేసింది మద్యం విధానం, అమ్మకాల్లో అక్రమాలపైనే అన్నారు. వైసీపీ హయాంలో రూ.1.24లక్షల కోట్ల మద్యాన్ని జగన్ నగదు రూపంలో అమ్మడమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల గొంతుల్లో విషం పోశారన్నారు. ప్రైవేట్ ల్యాబుల్లో చేయించిన పరీక్షల్లోనూ నాటి జే బ్రాండ్ మద్యం ఎంత ప్రమాదకరమైందో ఆధారాలతో నిరూపణైందన్నారు. 2019-2024 మధ్య రాష్ట్రవ్యాప్తంగా లివర్లు పాడై ప్రాణాలమీదకు తెచ్చుకున్న బాధితుల దీనగాథలు జగన్ దారుణాలకు సాక్ష్యం అన్నారు. జగన్, విజయసాయిరెడ్డి, వాసుదేవరెడ్డి, మిథున్‌రెడ్డి అధికారబలంతో డిస్టిలరీల మొత్తాన్ని గుప్పిట పెట్టుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న మద్యం పాలసీతో కూసాలు కదులుతాయనే జే-గ్యాంగ్‌లో కలకలం మొదలైందన్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అణచివేసిందే జగన్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 17: రాష్ట్రంలో సివిల్ సర్వీస్ అధికారుల పేరిట వైసీపీ జగన్ దొంగ డ్రామాలు మొదలుపెట్టారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తున్న మాజీ సీఎం జగన్‌రెడ్డి హయాంలోనే అఖిల భారత సర్వీసు అధికారులను దారుణమైన స్థితిలో అణచివేతకు గురిచేశారని మండి పడ్డారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో తీవ్ర వివాదాస్పద ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడంపై వైసీపీ తప్పుడు ప్రచారాలను చేస్తుందని శనివారం ప్రత్తిపాటి పత్రికా ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇన్ని ధర్మ పన్నాలు చెపుతున్న జగన్ వైసీపీ వారు నాటి సీఎస్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం విషయంలో ఏం చేశారో గుర్తులేదా? అని ప్రశ్నించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఐదు సంవత్సరాలపాటు పోస్టింగ్ ఇవ్వకుండా ఎలా వేధించింది, సస్పెన్షన్‌ల మీద సస్పెన్షలతో ఎలా ఇబ్బంది పెట్టింది మరచిపోయారా? అని ప్రశ్నించారు. అంతేగాక సివిల్ అధికారుల సర్వీస్ రిజిస్టర్లు జగన్ వద్దే పెట్టుకొని వేధించారని ఆరోపించారు. ఒక ఎంపీని లాకప్‌లో హింసించిన అధికారులపై చర్యలు తీసుకోకూడదా? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో చేసిన తప్పులపై వారే సిగ్గుతో తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవటం తమ ప్రభుత్వ విధానమని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

దేవాలయాల్లో దొంగతనాల కేసుల్లో నిందితుల అరెస్టు

● సుమారు రూ.16,99,700 విలువైన వస్తువులు స్వాధీనం



బాపట్లరూరల్, ఆగస్టు 17: దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సెంట్రల్ క్రైమ్ పోలీసుస్టేషన్ ఆవరణంలో విలేకర్ల సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీ కేసు వివరాలను వెల్లడించారు. తెనాలికి చెందిన కారంపూడి విజయ్‌కుమార్, తాడిపత్రి సాయి, చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన బండికట్ల పవన్‌కళ్యాణ్ అనే ముగ్గురు నిందితులు గత మూడునెలల నుంచి దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఉన్న దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులను శనివారం మధ్యాహ్నం చుండూరు మండలం ఆళ్ళపాడు వంతెన వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. నిందితులపై గతంలో గుంటూరు, విజయవాడ, తెనాలి, పల్నాడు జిల్లాల్లో కూడా కేసులు ఉన్నాయని తెలిపారు. బాపట్ల సీసీఎస్ పోలీసుస్టేషన్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య, చుండూరు సర్కిల్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేకబృందాలను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నామన్నారు. నిందితుల నుండి రూ.6లక్షల 9వేల 700 విలువైన వెండి, రూ.10లక్షల 55వేల విలువైన 10బైక్‌లు, రూ.35వేల విలువైన స్మార్ట్ టీవీ మొత్తం రూ.16లక్షల 99వేల 700 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మున్సిపల్ చైర్మన్ ఏసోబు రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చిన ఏసోబు

మాచర్ల టౌన్, ఆగస్టు 17: మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు శనివారం తన ప దవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తన రాజీనామా పత్రాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావుకు అందజేశారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 40 వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 17: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 55వేల 200, కీసర వాగు నుండి 2వేల 300 క్యూసెక్కుల వంతున మొత్తం 57 వేల 500 క్యూసెక్కుల వరద నీరు శని వారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 55 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 40వేల 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

పశ్చిమడెల్టాకాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 17: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 336, రేపల్లెకాల్వకు 1861, తూర్పుకాల్వకు 765, పశ్చిమకాల్వకు 280, నిజాంప ట్నంకాల్వకు 450, కొమ్మమూరుకాల్వకు 3040క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వర్సిటీలో రేపు
ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

● పలువురు ఫొటోగ్రాఫర్లకు బహుమతుల ప్రదానం
● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మండలి బుద్ధప్రసాద్

పెదకాకాని, ఆగస్టు 17: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 19 వరల్డ్ ఫొటోగ్రఫీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత శనివారం తెలిపారు. అదే రోజు పలువురు ఫొటోగ్రాఫర్లకు బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఫొటోగ్రఫీ డిప్లమా కోర్సు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు అదే రోజున ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా బహుమతి ప్రదానం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్‌ఏడీ బ్లాక్‌లో ఉన్న ప్రొఫెసర్ వై.ఆర్.హరిగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పోటీలలో విజేతలు...

ఫొటోగ్రఫీ విభాగం నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతలను ప్రకటించారు. వారిలో మోనోక్రోమ్ విభాగంలో ఉత్తమ ఫోటోకు బ్రహ్మయ్య వంగపల్లి, కలర్ ఫోటో విభాగంలో వానం శరత్‌బాబు, నేచర్ అండ్ వైల్డ్‌లైఫ్ విభాగంలో బి. సుబ్రహ్మణ్యం, ఫొటో జర్నలిజం విభాగంలో ఉదయన్ శంకర్‌పాల్, ట్రావెల్ ఫొటోగ్రఫీలో అగ్రబోయిన శంకర్ విజేతలుగా నిలిచారు. వీరితోపాటు ప్రోత్సాహక బహుమతులను కూడా అందించనున్నట్లు డాక్టర్ జి.అనిత తెలిపారు.

పులిచింతలకు 48వేలు...

● 1.0074 ఎంయుల విద్యుదత్పత్తి.. ఎస్‌ఈ వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 17: సత్రశాలలోని కృష్ణానది వద్ద నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0074 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 3 గేట్లను 2 మీటర్ల మేర, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 39,652 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8348, మొత్తం 48 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.30 మీటర్ల మేర నీరుండగా ఆ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 48 వేల క్యూసెక్కులు నీరు వచ్చి రిజర్వాయర్‌కు చేరుతుందన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 17 : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 57,685 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు గేట్ల ద్వారా 57,685 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నాయి.

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 17: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ అధికారులు శనివారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి 22,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8375 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 22,400, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 69,884 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,884 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

గురజాలటౌన్, ఆగస్టు 17: అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తేలుకుట్లలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తేలుకుట్ల గ్రామానికి చెందిన గుండాల ఆంజనేయులు (24) గత ఏడాది గ్రామంలో 6.5 ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. పంట సాగు పెట్టుబడికి రూ.9లక్షల వరకు అప్పులు అయ్యాయి. పంటసాగు దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక శనివారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు బావి నుంచి బయటకు తీసి గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

మద్యం మత్తులో కాల్వలో పడి వ్యక్తి మృతి



షేక్ అల్లాభక్షు మృతదేహం

ముప్పాళ్ళ, ఆగస్టు 17: కాలువ గట్టుపై కూర్చొని మద్యం తాగుతూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నెపాడుకు చెందిన షేక్ అల్లాభక్షు(40) పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ గట్టు పై కూర్చొని మద్యం తాగుతూ ఉన్నాడు. ఈక్రమంలో కాలువలో జారిపడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో కొట్టుకుపోయి చెట్ల కంపలకు చిక్కుకొనివున్న అల్లాభక్షు మృత దేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకు వచ్చారు. మృతుడికి భార్య అప్పర ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపుత చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు అదుపు తప్పి ఇద్దరు మృతి



దుర్గాప్రసాద్ మృతదేహం



వెంకటేశ్వరరావు మృతదేహం

తెనాలి రూరల్, ఆగస్టు 17: కారు అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన తెనాలి మండలం పెదరావూరు శివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకానికి చెందిన దుర్గాప్రసాద్ గుంటూరులో ఉంటూ కారు బాడుగలకు నడుపుతుంటాడు. ఆ క్రమంలోనే శుక్రవారం రాత్రి గుంటూరు నుండి వెల్లటూరుకు బాడుగకు వచ్చాడు. ప్రయాణీకులను దించి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆ వెళ్లే క్రమంలో వెల్లటూరులో అదే గ్రామానికి చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు(48) తెనాలి వెళ్లేందుకు ఎక్కించుకున్నాడు. వీరు ప్రయాణిస్తున్న కారు పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడిపే యలమందల దుర్గాప్రసాద్(35)కి భార్య, ఇద్దరు చిన్నారులున్నారు. వెంకటేశ్వరరావుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన తెనాలిలోని ఓ ఆశ్రమంలో పనిచేస్తున్నాడు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.96 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించండి
- వీధిదీపాలు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి
- త్వరలోనే బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీరు
- మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 17: కౌన్సిలర్లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులతో కలసి కృషి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభంకాగానే ఒకటో వార్డు కౌన్సిలర్ గట్ల అరుణ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉండే ఇటుకల బట్టీలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా ఇటుక బట్టీలను తరలించి ప్రజారోగ్యాన్ని కాపాడతామన్నారు. పట్టణంలో 100 పడకల ఆసుపత్రి, స్టేడియం ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వ స్థలాలు ఎంతో అవసరమన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి సమీకరించాలని ఆదేశించారు. పట్టణంలో ఆవులు, ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పట్టణంలో వీధి దీపాలు వెలగకపోవడం, పోలీసు పెట్రోలింగ్ లేకపోవడంతో దొంగతనాలు అధికమయ్యాయని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ క్వారీ చుట్టూ వ్యర్థాలను తొలగించి మల, మూత్ర విసర్జనలు చేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలుతో మాట్లాడానని, త్వరలోనే బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీటిని అందిస్తామన్నారు. అలాగే పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పురపాలక సంఘం యాప్‌ను రూపొందించి సమస్యల స్వీకరణ, పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు యర్రాకుల సిద్ధమ్మ, బుట్టి జ్యోతి, మదార్‌సాహెబ్, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలను పరిష్కరిస్తా

మాచర్ల రూరల్, ఆగస్టు 17: పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని శాసనసభ్యుడు బ్రహ్మనందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవాన్ని పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి ఏపీయూడబ్ల్యూజే జెండాను ఆవిష్కరించారు. పాత్రికేయుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం పాత్రికేయులకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నేతలు పలువురు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

వైద్య ఆరోగ్య సిబ్బంది నిరసన ప్రదర్శన

రెంటచింతల,ఆగస్టు 17:పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం, హత్యకు తీవ్రంగా ఖండిస్తూ రెంటచింతల పీహెచ్‌సీకి చెందిన వైద్య ఆరోగ్య బృందం డాక్టర్ కృష్ణారెడ్డి నేతృత్వంలో శనివారం పురవీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. వైద్యురాలిపట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని,విధుల్లో ఉండే డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టాల్లో సవరణలు చేసి అయినా సరే మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణారెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రమాదేవి, హేమల, సూపర్ వైజర్స్ కోటేశ్వరరావు, ఆంజనేయులు, నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీస్, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యంపై ఫిర్యాదు

రెంటచింతల, ఆగస్టు 17: మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన తల్లీ కూతుళ్ల అదృశ్యమైన ఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామదాసు రాజబాబు, కళ్యాణిలు భార్యా భర్తలు. గత కొంత కాలంగా వారి మధ్య మనస్పర్థలు వస్తూ ఉన్నాయి. ఈక్రమంలో శుక్రవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పిన కాళ్యాణి నాలుగేళ్ల కూతురైన వాగ్దేవిని తీసుకువెళ్లి తిరిగి రాలేదు. ఈ ఘటనలో భర్త రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

పత్తిలో చీడపీడల నివారణపై అవగాహన

దాచేపల్లి, ఆగస్టు 17: మండలంలోని నడికూడి గ్రామంలో ప్రత్తి పంటను పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ రైతులతో కలిసి పంటను పరిశీలించారు. పంటలపై ఆశిస్తున్న చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో పత్తి మొక్కలను ఆశిస్తున్న చీడపీడల నివారణకు ఆధునిక వ్యవసాయ విధానాలను తెలియజేశారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. పంట నమోదు వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టపరిహారం ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, తదితర పథకాల గురించి వివరించారు. మండల వ్యవసాయ అదికారి పాపకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో బలిజేపల్లి యువకుడి ప్రతిభ

రాజుపాలెం, ఆగస్టు17: మండలంలోని బలిజేపల్లి గ్రామానికి చెందిన గంగాధరి పేరయ్య కుమారుడు గాయత్రినాథ్ అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలలో తన ప్రతిభ చాటాడు. ఈ మేరకు శనివారం తెలంగాణలోని హైదారాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న గంగాధరి గాయత్రినాథ్ ఆరవస్థానం కైవసం చేసుకున్నాడు. తమ గ్రామ యువకుడు అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఆరవ స్థానం కైవసం చేసుకోవటంపై అదే గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తదితర గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదిగిన గాయత్రినాథ్‌ను గ్రామస్థులు అభినందించారు.



ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కన్నులపండువగా శాంతి కల్యాణం

రాజుపాలెం,ఆగస్టు17:మండలంలోని రాజుపాలెం గ్రామంలో కొలువైయున్న పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి ప్రథమ పుష్కర ద్వాదశ(12వ) వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రాసాదాలు స్వీకరించారు. కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన భారతి కళా సమితి డప్పుల సమాజంతో సంస్కృతి కార్యక్రమం, బాలనాగమ్మ జానపద నాటకాన్ని ఆలయ కమిటి చైర్మన్ పొత్తూరి వేంకటరమసుబ్బారావు ఏర్పాటు చేశారు.



మాచర్ల తహసీల్దార్ జియాఉల్‌హక్‌కు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు



దాచేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

వైద్యుల మానప్రాణాలకు రక్షణ ఏది?

దేశంలో వైద్యుల మాన ప్రాణాలకు రక్షణ లేదని, ఇందుకు కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్య ఘటనే నిదర్శనమని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలకత్తా ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై జరిగిన పాశవిక అత్యాచారం, హత్య ఘటనలను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు శనివారం విధులు బహిష్కరించారు. రోడ్ల మీదకి వచ్చి నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఆందోళనలు చేపట్టారు. హేయమైన దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు.

- కలకత్తా వైద్యవిద్యార్థినిపై ఘటన దేశానికే మచ్చ
- తక్షణమే నిందితులకు కఠిన శిక్ష అమలు చేయాలి
- వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి
- నిరసన ఆందోళనల్లో వైద్యులు

సత్తెనపల్లి,ఆగస్టు 17: సత్తెనపల్లి ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం రెండు గంటలపాటు విధులు బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నో సేఫ్టీ, నోడ్యూటీ అంటూ నినాదాలు చేశారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఆర్డీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైద్యులు గిరిరాజు, శ్రావణి, బీ.అరుణ, ఆర్ఎంవో శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు కూడా వైద్యశాలలను మూసివేసి పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. వైద్య రాలిపై అత్యాచారం, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కారంపూడి: రోగుల ప్రాణాలను రక్షించే వైద్యులకు ప్రాణ రక్షణ లేకుండా పోయిందని, కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం అత్యంత పాశవికమని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రమ్య, మౌనికలు అన్నారు. వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం పీహెచ్‌సీ వద్ద ఆందోళన నిర్వహించారు. నిందితులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐఎంఏశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6 గంటల నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు పిడుగురాళ్ల ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్ తెలిపారు.

దాచేపల్లి: దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి రాష్ట్ర రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. వైద్యులకు రక్షణ లేకుండా పోవడం, దాడులకు పాల్పడటం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఐ.అమూల్య, షేక్ షహీన్‌సుల్తానా, హెల్త్‌సూపర్‌వైజర్లు లక్ష్మయ్య, గోవిందమ్మ, మేరికుమారి, స్టాఫ్ నర్సు సుశీల, ఫార్మా సిస్టు విజయలక్ష్మీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరం: మాచవరం పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది శనివారం ఓపీ నిలిపివేసి తమ నిరసనను వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైద్యాధి కారులు ప్రసాదరావు, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్ళూరు పీహెచ్‌సీలో క్యాండిల్స్ వెలిగించి మౌనం పాటిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్ళూరు ప్రాథమిక వైద్యశాలలో పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీకేఏఆర్ వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలి పై, రాజస్థాన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సుపై జరిగిన సామూహిక అత్యాచారాలకు నిరసనగా క్యాడిల్స్ వెలిగించి నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, ఎంపీ హెచ్‌ఈవో విజయకుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

మాచర్లటౌన్ : ప్రజల ప్రాణాలను రక్షించే వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని మాచర్ల కమ్యూనిటి హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను అన్నారు. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ పట్టణంలో వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ జరిపారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జియాఉల్‌హక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైద్యులు కెపి చారి, దినేష్, సురేష్, మురళీకృష్ణ, ఉషారాణి, లావణ్య, రాణి, రేవతి, జయప్రకాష్, మురళీచంద్ర, వంశి, తిలక్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు



మాచవరం పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నేడు మెగా జాబ్‌మేళా

మాచర్లటౌన్, ఆగస్టు17: పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఆదివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 70 సాఫ్ట్‌వేర్, నాన్‌టెక్నికల్ కంపెనీలు పాల్గొనుచుండగా, 1000 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివినవారు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెల్లంకొండ, ఆగస్టు17: రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన పాలైన బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం జరిగింది. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన గోపయ్య చంద్రాజుపాలెం నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు వెళ్ళేందుకు ఆటోలో బయలుదేరాడు. ఆటో నాగిరెడ్డిపాలెం గ్రామం వద్దకు రాగానే, ఆటోను ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో గోపయ్య కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించినట్టు బంధువులు తెలిపారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విజృంభిస్తున్న జ్వరాలు

అచ్చంపేట, ఆగస్టు 17 : మండలంలోని కొండూరు, నిండుజర్ల, తాడువాయి గ్రామాల్లో ప్రజానీకం జ్వరాలతో అల్లాడుతున్నారు. గత కొన్ని రోజులుగా వీరికి జ్వరాలు తగులుతున్నాయి. ఎక్కువ మందికి టైఫాయిడ్ జ్వరాలు సూచిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే ఈ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

విద్య - ప్రేరణపై బాలికలకు అవగాహన

వెల్దుర్తి, ఆగస్టు 17: మండలంలోని శిరిగిరిపాడు గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'విద్య - ప్రేరణ' అనే అంశంపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ కుటుంబంలో ఓ మహిళ చదువుకొని స్థిరపడితే వారి ద్వారా మూడు తరాలు బాగుపడతాయన్నారు. బాలికలు ఆత్మ విశ్వాసంతో చదువుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ నాగేశ్వరరావు, యేసయ్య, పోతురాజు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా జహీరా

రాజుపాలెం, ఆగస్టు17 : మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలోని ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా గ్రామానికి చెందిన షేక్ జహీరా, వైస్ చైర్మన్‌గా షేక్ మహబూబ్ షరీఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 8న జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నిక వాయిదాపడి శనివారం జరుగగా చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారివురుని కూటమి నాయకులు అభినందించి సత్కరించారు.

పీఎంసీ చైర్మన్‌గా సాంబశివరావు

అచ్చంపేట, ఆగస్టు 17: స్థానిక డాక్టర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా చిగురుపాడు గ్రామానికి చెందిన దుద్దుల సాంబశివరావు ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బాణావత్ స్వాతిబాయి ఎన్నికయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ ఎన్నికైనవారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికైన వారిని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, రాయిడి సాంబశివుడు, బత్తుల శ్రీనివాసరావు, యడ్లపల్లి బుచ్చిబాబు తదితరులు సత్కరించారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

సత్తెనపల్లి, ఆగస్టు 17 : స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని టీటీడీ కళ్యాణ మండపంలో డాక్టర్ అగ్రవాల్స్ కంటి క్లినిక్ ఆధ్వర్యం 19న సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం విలేకరులకు తెలిపారు. సత్తెనపల్లి పట్టణంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

మోడల్ స్కూల్ విద్యాకమిటి చైర్మన్ మేరి

కారంపూడి, ఆగస్టు 17: కారంపూడి మోడల్ స్కూల్ విద్యా కమిటి చైర్మన్‌గా దావులూరి మేరి, వైస్ చైర్మన్‌గా రమావత్ కృష్ణానాయక్ ఎన్నికయ్యారు. శనివారం పాఠశాలలో ఎంఈవో రవికుమార్ ఆధ్వర్యాన ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారిని విద్యార్థుల తల్లిదండ్రులు దుశ్శాలువాలతో సన్మానించారు.

చిట్టా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

సత్తెనపల్లి, ఆగస్టు 17 : చిట్టా ఈశ్వర సాయి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని పలువురు న్యాయవాదులు అన్నారు. చిట్టా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని న్యాయవాదులు అందించారు. ఈ సందర్భంగా వారు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, భరద్వాజ్ సేవలను కొనియాడారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వీరవల్లి శ్రీనివాసరావు, దస్తగిరి, యల్లారెడ్డి, నరిచేటి వేణుగోపాల్, చలపతిరావు, గంటూరి అజయ్, చింతాడ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కాపురానికి తీసుకెళ్లలేదని భార్య ఫిర్యాదు

పెదకూరపాడు, ఆగస్టు 17: తనను కాపురానికి తీసుకు వెళ్లలేదంటూ భర్తపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలోని హుస్సేన్ నగరంలో జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల రోజ్‌మేరీ గుంటూరుకు చెందిన తన భర్త కిరణ్ అత్తమామలు అదనపు కట్నం కోసం ఇబ్బందులు పెడుతున్నారని, ఈ కారణంతో కాపురానికి తీసుకు వెళ్ళటం లేదంటూ ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీ వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

క్రోసూరు, ఆగస్టు 17 : మండలంలోని హసనాబాద్‌లో డయేరియా వైద్యశిబిరం కొనసాగుతోందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్‌సాద్ తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిస్థితిని తెలుసుకొని అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారని, శనివారం కొత్త కేసులు నమోదు కాలేదని, పాత కేసులను పరిస్థితి మేరకు డిచ్చార్జ్ చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో కలుషిత నీటికి కారణమైన బోరింగ్ పంపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించకుండా చూశామన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల సహకారంతో తిను బండారాల హోటళ్ళపైన, చిన్నపిల్లలు తినే తినుబండారాల పైన ఆంక్షలు విధించామన్నారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియ జేస్తున్నట్టు తెలిపారు.



ఇంటింటి సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, ఆగస్టు 17 : సత్తెనపల్లి కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, బ్యాంక్ మేనేజర్లు సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, బ్యాంక్ మేనేజర్లతో లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివిధ బ్యాంకులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యేలా బ్యాంక్ మేనేజర్లు చూడాలన్నారు. సమావేశంలో న్యాయాధికారులు తౌఫిక్ హుస్సేన్, పీ ప్రియదర్శిని, బ్యాంక్ ప్యానల్ న్యాయవాదులు చలువాది చిన సత్యనారాయణ, ఎన్.ఆంజనేయులు, డీఎస్పీ గురునాథబాబు, కే శ్రీనివాసరావు, ఎస్ఐ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు

క్రోసూరు, ఆగస్టు 17 : రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌ల ప్రారంభంతో కూలీ, నాలి చేసుకొనే నిరు పేదలకు కడుపు నిండా భోజనం లభిస్తుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావులు అన్నారు. శనివారం క్రోసూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేవలం ఐదు రూపాయలకే భోజనం, ఉదయం పూట అల్పాహారం ఇవ్వాలన్న నిర్ణయం చారిత్రాత్మక మైనదన్నారు. గత ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని రద్దు చేయటమే కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నక్యాంటీన్ భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ అన్నక్యాంటీన్లకు జీవం వచ్చినట్లయిందన్నారు. నిరు పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు వెల్లువలా వస్తున్నాయని, పెదకూరపాడు నియోజక వర్గం నుంచి కూడా విరాళాలు ఇవ్వాలని వారు పిలుపు నిచ్చారు. పెదకూరపాడు నియోజక వర్గంలోని క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు మండలకేంద్రాల్లో త్వరలో అన్నక్యాంటీన్‌లను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్ ప్రకటించటం హర్షణీయమన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షులు తోకా వెంకటరావు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాన్, మన్నెం శ్రీనివాసరావు, అనుమాల పూర్ణ, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

సమస్యలను పరిష్కరించాలి

సత్తెనపల్లి, ఆగస్టు 17 : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాచేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. 2005 సర్వీస్ రూల్స్ ప్రకారం వీఆర్ఏలతో అటెండర్, నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు చేయించ కూడదన్నారు. పే స్కేల్ అమలు చేయాలని, వీఆర్ఏలకు వీఆర్‌వోలుగా ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు బందగి, సంజీవరావు, సుబ్బారావు, రవి, మస్తాఫా, కాసులు, రాజు, సుందర రావు, సిద్దయ్య, బుడే, కరిముల్లా, బ్రహ్మయ్య, శ్యామ్‌సన్, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు చేయూత

మాచవరం, ఆగస్టు 17: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ చేయూతనిస్తుందని జిల్లా సహాయ సమన్వయ అధికారి ఆర్.సెల్వరాజ్ సూచించారు. శనివారం మండలంలోని చెన్నాయపాలెం, వేమవరం, మాచవరం గ్రామాల్లో ప్రత్యేక అవస రాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులను కలిసి పిల్లల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం ప్రతి మండలకేంద్రంలో భవిత కేంద్రాలను ఏర్పాటుచేసి ఉచిత వైద్యశిబిరాలు, ఫిజియోథెరపి క్యాంప్‌లు నిర్వహిస్తుంద న్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, కే.భార్గవి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి సంతాపం

క్రోసూరు, ఆగస్టు 17 : మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెరుమాళ్ళపల్లి అబ్రహం మృతికి ఆ పార్టీ నేతలు నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణితో పాటు పలువురు పార్టీ నాయకులు అబ్రహం మృత దేహాన్ని సందర్శించి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ ఫోన్‌లో అబ్రహం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ కార్యదర్శి మొగల్‌జాన్, గుడిపాడు బాషా పాల్గొన్నారు.



దైద గ్రామంలో పల్స్ సర్వే చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ముమ్మరంగా జలజీవన్ సర్వే

- 4 మండలాల పరిధిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- సర్వే పూర్తయిన తర్వాతే పనులు ప్రారంభం ?

పిడుగురాళ్ల, ఆగస్టు17: కేంద్ర గ్రామీణ నీటిసరఫరా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్న అన్ని ప్రాంతాల్లో పల్స్ సర్వే నిర్వహించాలని ఆదేశించడంతో గత కొద్ది రోజులుగా ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ అధికారులు ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ట్యాప్ కనెక్షన్ ఇచ్చిన వాటి వివరాలు ఆన్‌లైన్ చేయడంతో పాటు ఇంకా ఇవ్వాల్సిన ట్యాప్ కనెక్షన్ వివరాలు, సాగునీటి సరఫరాలో అంతరాయం, ట్యాప్ కనెక్షన్ ద్వారా నీటి సదుపాయం ఎలా వుంది, సురక్షితమైన మంచినీరు అందుతుందా అనే ప్రశ్నలతో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి గృహ యజమానుల వద్ద ప్రశ్నావళికి అప్పటికప్పుడే సమాధానాలను సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ చేయడం జరుగుతుంది. మరో నెలరోజుల్లో పల్స్ సర్వే పూర్తవుతుంది. అప్పుడే నిధులు లభ్యత, ఖర్చు వివరాలపై నివేదిక అందుతుంది. ఆ తర్వాతే జలజీవన్ మిషన్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

గురజాల నియోజకవర్గ పరిధిలో గ్రామీణ నీటిసరఫరా శాఖకు సంబంధించి జలజీవన్ మిషన్ పథకం 2021లో మంజూరైంది. 4 మండలాల పరిధిలో వంద పనులుగా విభజించి అధికారులు అంచనాలను ఆమోదించారు. పిడుగురాళ్ల మండలంలో 36 పనులు మంజూరు కాగా, 19 పనులు ప్రారంభమయ్యాయి. మరో 8 పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. నాలుగు పనులకు సంబంధించి వర్క్ జరుగుతుండగా మరో 5 పనులు పూర్తయ్యాయి. మాచవరం మండలంలో మొత్తం 19పనులు మంజూరు కాగా, రెండు మినహా మిగిలిన 17 పనుల్లో 10 పనులు జరుగుతుండగా 7 పనులు పూర్తయ్యాయి. దాచేపల్లి మండలంలో మొత్తం 27 పనులు మంజూరుకాగా, 13 మొదలుకాగా 10 పనులు జరుగుతున్నాయి. మరో 4 పనులు పూర్తయ్యాయి. గురజాల మండలంలో మొత్తం 18 పనులు మంజూరు కాగా, 11 మొదలయ్యాయి. 2 పనులు ఇంతవరకు ప్రారంభించకపోగా 4 పనులు జరుగుతుండగా మరొకటి పూర్తయింది. మొత్తం 4 మండలాలకు సంబంధించి రూ.7,296.84 కోట్లు మంజూరు కాగా ఇప్పటికి 966.32 కోట్లు ఖర్చుచేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 57,719 గృహాలకు ట్యాప్ కనెక్షన్ ఇచ్చేందుకు లక్ష్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనిచేయగా ఇప్పటికి 10,755 గృహాలకు ట్యాప్ కనెక్షన్ ద్వారా నీటిని సరఫరా చేయడం పూర్తిచేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

● జాస్తి వీరాంజనేయులు



జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17: పల్నాడు జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ సర్ చార్జి, వృత్తి పన్ను, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు జాయింట్ కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సర్‌చార్జి నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యేవిధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారన్నారు. జిల్లావ్యాప్తంగా 526 గ్రామపంచాయతీల్లో రిజిస్ట్రేషన్ సర్‌చార్జి, వృత్తి పన్ను, 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తే సర్పంచులకు గ్రామపంచాయతీలకు ఊరటగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో నీటి సరఫరాకు, బ్లీచింగ్‌కు పారిశుధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు చెల్లింపులకు వెసులు బాటుగా ఉంటుందని తెలిపారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగూరి రాదాకృష్ణమూర్తి

వినుకొండ, ఆగస్టు 17: విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏపీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాదాకృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శివయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మిక హక్కుల కోసం నిర్వహించే సమ్మేళన కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సంద్రపాటి సైదా, బూదాల శ్రీనివాసరావు, నరసింహరావు, శ్రీనివాసరెడ్డి, సంపెంగుల రాజు, శారమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, ఆగస్టు 17 : మండలంలోని నాదెండ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. నాదెండ్ల, చిరుమామిళ్ళ, గొరిజవోలు, సంక్రాంతిపాడు, జంగాపల్లి గ్రామాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంఎస్ సుధీర్



నూతన ప్రిన్సిపాల్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కళాశాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంఎస్ సుధీర్‌కు కళాశాల కమిటీ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్, కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. కళాశాలలో ప్రస్తుతం రసాయనశాస్త్ర అధ్యాపకులుగా, వైస్ ప్రిన్సిపాల్‌గా ఎంఎస్ సుధీర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు, సెక్రటరీ & కరస్పాండెంట్ శనివారం ఎంఎస్ సుధీర్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రకటించారు. కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకులుగా, నాక్ కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న పి.శ్రీనివాససాయిని వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ

● కళాశాల ఎన్‌సీసీ అధికారి రాజేష్‌బాబు



ఎన్ఈసీలో మొక్కలు నాటుతున్న కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17: ప్రపంచంలో రోజు రోజుకు పెరుగుతున్న నాగరికతతో పాటుగా వాతావరణ కాలుష్యం కూడా వేగంగా పెరుగుతుందని పర్యావరణ పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు 'ప్రతి ఎన్‌సీసీ క్యాడెట్ ఒక మొక్క' కార్యక్రమం శనివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న 80మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటారు. కార్యక్రమంలో కళశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు, 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, వైస్ ప్రిన్సిపాల్ డి.సునీల్‌కుమార్, పీడీ ఎల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సాంస్కృతిక శిక్షణ అభినందనీయం

● బెజవాడ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు

శావల్యాపురం, ఆగస్టు 17: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రత్యేక శిక్షణనిచ్చి వారిని తీర్చిదిద్దడం అభినందనీయమని బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీ పాఠశాల్లోని కోలాట శిక్షకులు పారెళ్ళ గురుబాబు, పారెళ్ళ మాలతి, గరికపాటి రవిలను శనివారం పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ నర్సరావుపేటలోని కోడెల శివప్రసాద్ క్రీడా ప్రాంగణం లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాఠశాలకు చెందిన 60మంది విద్యార్థులతో కోలాటంలో అత్యుత్తమ ప్రదర్శననిచ్చి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా కోలాట శిక్షకులు ముగ్గురు ప్రశంసాపత్రాలను అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కోలాట శిక్షకులను పీఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, భువనేశ్వరి, విమలకుమారి, హబీ, కిరణ్మయి, శ్రీనివాసరావు, అబ్దుల్లా, సురేష్, వసంతరావు తదితరులు అభినందించారు.

ఘనంగా దేవాలయ కప్పు రాళ్ల గ్రామోత్సవం

నాదెండ్ల, ఆగస్టు 17 : మండలంలోని సాతులూరు గ్రామంలో పునర్నిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ తల్లి దేవాలయం పైకప్పు రాళ్లను శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం దేవాలయం స్లాబు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఆ రాళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బ్యాండ్ మేళాలతో కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు చేయూత

మాచవరం, ఆగస్టు 17: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ చేయూతనిస్తుందని జిల్లా సహాయ సమన్వయ అధికారి ఆర్.సెల్వరాజ్ సూచించారు. శనివారం మండలంలోని చెన్నాయపాలెం, వేమవరం, మాచవరం గ్రామాల్లో ప్రత్యేక అవస రాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులను కలిసి పిల్లల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం ప్రతి మండలకేంద్రంలో భవిత కేంద్రాలను ఏర్పాటుచేసి ఉచిత వైద్యశిబిరాలు, ఫిజియోథెరపి క్యాంప్‌లు నిర్వహిస్తుంద న్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా వైద్యుల ర్యాలీ

● ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన
● నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
● అధికారులకు వినతిపత్రాల అందజేత



నరసరావుపేటలో జేసీ సూరజ్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్య బృందం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 17: కోల్‌కతా వైద్య కళాశాలలో శిక్షణ వైద్యురాలిపై జరిగిన హత్యాచారన్ని నిరసిస్తూ కారకులు, నిందితులపై కఠిన శిక్ష అమలుచేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చెందిన స్థానిక వైద్యులు వేర్వేరుగా శనివారం పట్టణంలో ప్రదర్శన చేశారు. సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. జాతీయ వైద్యమండలి పిలుపు మేరకు స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు వైద్యులు నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్లో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు కాగా ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు కూడా డాక్టర్ నాయక్ నేతృత్వంలో పల్నాడు బస్టాండ్‌లోని పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి ప్రధాన కూడలి గుండా కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు పల్నాడు జిల్లా అడ్మిన్ ఏఎస్పీ రాఘవేంద్రని కలిసి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఐఎంఏ నాయకులు ప్రకాష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ భారతి పట్టణానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనలో వైద్యశాల పీజీ డాక్టర్లు వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఐఎంఏ నాయకులు డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు డాక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ భారతి రాంప్రసాద్ పట్టణానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల బంద్



చిలకలూరిపేటలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

చిలకలూరిపేట, ఆగస్టు 17: చిలకలూరిపేటలో శనివారం డాక్టర్లు తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఆస్పత్రులు మూసి వేసి వైద్యసేవలు నిలిపి వేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట సెంటర్‌లో డాక్టర్లు మానవహారంగా ఏర్పడి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాన సెంటర్ల గుండా ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. డాక్టర్లకు పలు సంఘాల వారు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు లావు అరుణ, మధులతలతో పాటు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు, డాక్టర్ కందిమళ్ళ వాసుదేవ్, డాక్టర్ లావు సతీష్, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు బార్ అసోసియేషన్ తరపున భాగ్యారావు, వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ చిలకలూరిపేట, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, ఇన్నర్ వీల్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక, మోడరన్ విద్యా సంస్థల విద్యార్థులు నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది నిరసన ర్యాలీ

నాదెండ్ల, ఆగస్టు 17: నాదెండ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ఎస్ సాయి శ్వేత, సీహెచ్ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో నల్లబ్యాడ్జీలతో నిరసన..

శావల్యాపురం, ఆగస్టు 17: శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పీహెచ్‌సీ నుంచి శావల్యాపురం సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించి నిందుతున్ని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. వైద్యాధికారి రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య సిబ్బందికి, మెడికల్ విద్యార్థులకు ప్రత్యేక భద్రతను కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏడుకొండలు, స్టాఫ్‌నర్స్ ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్‌లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు సంకీర్తన, పృధ్వీరాణి, శ్రీదేవి, షీబాబాయి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



శావల్యాపురంలో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ

రొంపిచర్ల, ఆగస్టు 17: మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం జడ్పీ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల భాషలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 19వ తేదీన సోషల్, సైన్స్ సబ్జెక్టులపై శిక్షణ జరగనున్నట్టు ఎంఈవో బ్రహ్మేశ్వరరావు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో

రొంపిచర్ల, ఆగస్టు 17: మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో బ్రహ్మేశ్వరరావు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని నిర్వాహకులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు సుభానీ ఉన్నారు.

విప్పర్ల పాఠశాలకు బీరువా వితరణ

రొంపిచర్ల, ఆగస్టు 17: మండలంలోని విప్పర్ల ఎంపీపీ పాఠశాలలో బీరువాను శుక్రవారం వితరణ చేశారు. ఉపాధ్యాయిని కే హైమావతిదేవి మునువడి పుట్టిన రోజు సందర్భంగా బీరువాను బహూకరించారు. విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● అన్యక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించండి
● వీధిదీపాలు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి
● త్వరలోనే బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి తాగునీరు
● మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 17: కౌన్సిలర్లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించేందుకు అధికా రులతో కలసి కృషి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభంకాగానే ఒకటో వార్డు కౌన్సిలర్ గట్ల అరుణ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉండే ఇటుకల బట్టీలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా ఇటుక బట్టీలను తరలించి ప్రజారోగ్యాన్ని కాపాడతామన్నారు. పట్టణంలో 100 పడకల ఆసుపత్రి, స్టేడియం ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వ స్థలాలు ఎంతో అవసరమన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి సమీకరించాలని ఆదేశించారు. పట్టణంలో ఆవులు, ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పట్టణంలో వీధి దీపాలు వెలగకపోవడం, పోలీసు పెట్రోలింగ్ లేకపోవడంతో దొంగతనాలు అధికమయ్యాయని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ క్వారీ చుట్టూ వ్యర్థాలను తొలగించి మల, మూత్ర విసర్జనలు చేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలుతో మాట్లాడానని, త్వరలోనే బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీటిని అందిస్తామన్నారు. అలాగే పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పురపాలక సంఘం యాప్‌ను రూపొందించి సమస్యల స్వీకరణ, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యంపై ఫిర్యాదు

రెంటచింతల, ఆగస్టు 17: రెంటచింతలకు చెందిన తల్లీ కూతుళ్ల అదృశ్యమైన ఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామదాసు రాజబాబు, కళ్యాణిలు భార్యాభర్తలు. కొంతకాలంగా వారి మధ్య మనస్పర్థలు వస్తూ ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పిన కళ్యాణి నాలుగేళ్ల కూతురైన వాగ్దేవిని తీసుకువెళ్లి తిరిగి రాలేదు. ఈ ఘటనలో భర్త రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

ఆయిల్ పామ్ పంటల ద్వారా అధిక ఆదాయం

● జిల్లా ఉద్యాన శాఖాధికారి రమణారెడ్డి

ఈపూరు, ఆగస్టు 17: ఆయిల్ పామ్ పంటలను సాగు చేయడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందుతారని జిల్లా ఉద్యాన శాఖాధికారి సీహెచ్ రమణారెడ్డి అన్నారు. మండలంలోని గుండేపల్లిలో ఆయిల్ పామ్ మొక్కలను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహకాలు, రాయితీలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సరావుపేట ఉద్యాన శాఖాధికారి నవీన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు, ఏఈవో బండి అప్పారావు, ఉద్యాన సహాయకులు గాలం యతేంద్ర నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ మురళీ కృష్ణ

వినుకొండటౌన్, ఆగస్టు 17: విద్యార్థులు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ మురళీ కృష్ణ తెలిపారు. స్థానిక గంగినేని కల్యాణీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జిల్లా స్థాయి రెడ్ రన్ (మారదాన్) పల్నాడుజిల్లా దిశా, క్లస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఐదు కిలో మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కళాశాల ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ కిశోర్, వైద్యసిబ్బంది సురేష్, విహాన్ ప్రాజెక్టు పీసీ గౌస్, నాగేశ్వరరావు, ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు

క్రోసూరు, ఆగస్టు 17 : రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌ల ప్రారంభంతో కూలీ, నాలి చేసుకొనే పేదలకు కడుపు నిండా భోజనం లభిస్తుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరావులు అన్నారు. శనివారం క్రోసూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేవలం ఐదు రూపాయలకే భోజనం, ఉదయం పూట అల్పాహారం ఇవ్వాలన్న నిర్ణయం చారిత్రాత్మక మైనదన్నారు. గత ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని రద్దు చేయటమే కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నక్యాంటీన్ భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ అన్న క్యాంటీన్లకు జీవం వచ్చినట్లయిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు వెల్లువలా వస్తున్నాయని, పెదకూరపాడు నియోజకవర్గం నుంచి కూడా విరాళాలు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు మండలకేంద్రాల్లో త్వరలో అన్న క్యాంటీన్‌లను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రకటించటం హర్షణీయమన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు తోకా వెంకటరావు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాన్, మన్నెం శ్రీనివాసరావు, అనుమాల పూర్ణ, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, ఆగస్టు 17: సత్తెనపల్లి కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, బ్యాంక్ మేనేజర్లు సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, బ్యాంక్ మేనేజర్లతో లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివిధ బ్యాంకులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యేలా బ్యాంక్ మేనేజర్లు చూడాలన్నారు. సమావేశంలో న్యాయాధికారులు, బ్యాంక్ ప్యానల్ న్యాయవాదులు, డీఎస్పీ, ఎస్ఐ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

మాచర్లటౌన్, ఆగస్టు 17: పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఆదివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 70 సాఫ్ట్‌వేర్, నాన్‌టెక్నికల్ కంపెనీలు పాల్గొనుచుండగా, 1000 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

పోలీసు అధికారులతో న్యాయాధికారుల సమీక్ష



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు, పోలీసు ఉన్నతాధికారులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 17: జాతీయ రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి స్థానిక న్యాయధికారులు పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి మాట్లాడుతూ కేసులు పెద్ద సంఖ్యలో రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకువాల్సిందిగా పోలీస్ అధికారులకు సూచించారు. కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడంలో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలను లేవనెత్తగా వాటిని ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ నరసరావుపేట మొదటి పట్టణ సీఐ చరణ్ రెండో పట్టణ సీఐ భాస్కర్ ఫిరంగిపురం సీఐ వీరేంద్రబాబు ట్రాఫిక్ సీఐ రాంబాబుసబ్ డివిజన్లోని ఎస్ఐలు సురేష్ ప్రియాంక అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై కూడా వారు సమీక్ష నిర్వహించారు.

ఎంఎస్‌సీకి ఆసక్తి చూపని న్యాయవాదులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 17: నర్సరావుపేట మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించడానికి దరఖాస్తులను కోరుతూ ఇటీవల మున్సిపల్ కమిషనర్ స్థానిక న్యాయవాద సంఘానికి సమాచారం పంపారు. సమాచారానికి స్థానిక న్యాయవాదుల నుంచి పెద్దగా స్పందన రాలేదు. సుమారు 300 మంది సభ్యత్వం కలిగి ఉన్న న్యాయవాదసంఘంలో కేవలం ఇద్దరు మాత్రమే దరఖాస్తులు అందజేసినట్లు సంఘం కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు తెలిపారు.

ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నాదెండ్ల, ఆగస్టు 17: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలువురు న్యాయవాదులు వివరించారు. మండలంలోని గణపవరంలో గల సీఆర్ పాలిటెక్నిక్ ప్రాంగణంలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, చట్టపరమైన అంశాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, జీవించే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీ వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాదు, బీ రాజేష్, ఎం భానుప్రసాదు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫరూక్ తదితరులు ఉన్నారు.

రెండో రోజు ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



మట్టితో ఏర్పాటు చేసిన భూదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

వినుకొండటౌన్, ఆగస్టు 17: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో స్వామి వారి 38వ బ్రహోత్సవాల్లో బాగంగా రెండో రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంత్యంత వైభవోపేతంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మట్టితో ఏర్పాటు చేసిన భూదేవి విగ్రహం వద్ద ఆరాధన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్ర అగ్ని ధాన్యం నిత్య హోమం, హనుమంతుడు వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. శ్రీభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం, 19 తేదీన శ్రీవారి అపూర్వ రథోత్సవం, 20న నిత్య హోమం చక్రస్నానోత్సవం, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన సబ్‌యూనిట్ అధికారి



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు

రొంపిచర్ల, ఆగస్టు 17: మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని లేబొరేటరీ, ఇంజక్షన్ రూమ్, మందుల గదిని పరిశీలించారు. ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఉన్నారు.

చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి మృతి

రొంపిచర్ల, ఆగస్టు 17: మండలంలోని నలగార్లపాడు గ్రామానికి చెందిన సొసైటీ ఉద్యోగి ఓరుగంటి శ్రీనివాస రెడ్డి(45) చికిత్స పొందుతూ శనివారం నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందాడు. ఈ నెల 16న గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చేరారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్‌తో యువకుడిపై దాడి

నాదెండ్ల, ఆగస్టు 17: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో శుక్రవారం రాత్రి బీరు బాటిల్‌తో యామర్తి సాగర్‌బాబు అనే యువకుడిపై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాధితుడు సాగర్ బాబు, జడా జాన్ పీటర్, యామర్తి సాగర్, బాలస్వామిలు స్నేహితులు. నిన్ను చంపుతానంటూ జాన్ పీటర్ మద్యం మత్తులో సాగర్ బాబును బెదిరించాడు. ఇంటి వద్ద మంచంపై పండుకున్న సాగర్ బాబును జాన్ పీటర్ బీరు బాటిల్ పగల గొట్టి మెడపై పొడిచాడు. అతడికి సాగర్ బాలస్వామి కూడా తోడ్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ సాగర్‌బాబును చికిత్స కోసం గుంటూరు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పుల్లారావు గ్రామాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పేద విద్యార్థికి రూ.20 వేల ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 17: పట్టణానికి చెందిన బొల్లు రాజేశ్వరి 26వ వర్ధంతి సందర్భంగా బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక తిరుమల ఇంజనీ రింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న బొక్కిసం జయలక్ష్మికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకటకృష్ణారావు, ట్రస్టు సభ్యులు బొల్లు వెంకటేశ్వర్లు, మర్లపాటి రామకృష్ణ, జాస్తి గోపాలకృష్ణబాబు, గార్లపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.